క్లుప్తంగా

సచివాలయ ఉద్యోగులకు సత్కారం



అల్లవరం సచివాలయ ఉద్యోగులకు సన్మానం

అల్లవరం: అల్లవరం-1, 2 సచివాలయాల్లో వివిధ విభాగాల్లో విధులు నిర్వర్తించి వేర్వేరు సచివాలయాలకు బదిలీలపై వెళ్లిన ఉద్యోగులకు అల్లవరం పంచాయతీ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. సర్పంచ్ బొమ్మి బాలవేణి అధ్యక్షతన నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు లోవరాజు, అర్జున్, సువర్ణ, గంగాభవాని, సురేష్, రాజకుమారి, యోగ నాగేశ్వరి, షేక్ బేగంను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఎస్.మౌనిక, కంకిపాటి వీరబాబు, మామిడిశెట్టి రాజు, సుంకర సాయి, కార్యదర్శి రాజమోహన్ పాల్గొన్నారు.

ఆదిలక్ష్మి అమ్మవారికి ఆషాఢ సారె



గాడిలంక గ్రామ దేవత ఆదిలక్ష్మికి భక్తులు సమర్పించిన చీర, సారె

ముమ్మిడివరం: గాడిలంక గ్రామ దేవత శ్రీ ఆదిలక్ష్మి (రాజేశ్వరి) అమ్మవారికి సోమవారం ఆషాఢం సారె సమర్పించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామ ముత్తైదువులు ముందుగా అమ్మవారికి పసుపు నీళ్లతో అభిషేకం, చేసి ఆడపడుచులు తీసుకువచ్చిన చీర, సారె సమర్పించారు. సమరత సేవా ఫౌండేషన్ సౌజన్యంతో అమ్మవారికి కుంకు పూజ, నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గిరిగి సత్యసాయి రామ్ దంపతులు ఎంపీటీసీ గిరిగి వీరదుర్గాకుమారి, తోట చిన్నారావు, కొమ్మిరెడ్డి సూర్య చంద్రరావు, పళ్ల కృష్ణ, మహాదశ సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

శాకంబరి అలంకరణలో పోలేరమ్మ



గంగాదేవి పోలేరమ్మకు భక్తులు సమర్పించిన సారె

అమలాపురం రూరల్: ఈదరపల్లి గ్రామ దేవత గంగాదేవి పోలేరమ్మవారు ఆషాఢ మాసం సందర్భంగా సోమవారం శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈదరపల్లి రామాలయం దగ్గర నుంచి గ్రామ దేవత పోలేరమ్మ తల్లికి గ్రామ ప్రజలు, ఆడపడుచులు, భక్తులు సారె సమర్పించి పూజలు చేశారు.

సొసైటీ అధ్యక్షుడిగా శరత్‌బాబు ప్రమాణ స్వీకారం

అమలాపురం టౌన్: పట్టణంలోని కళా వెంకట్రావు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (సొసైటీ) త్రిసభ్య కమిటీ అధ్యక్షుడిగా అల్లాడ శరత్‌బాబు స్థానిక డీసీసీబీ బ్యాంక్‌లో సోమవారం ఉదయం ప్రమాణ స్వీకారం చేశారు. స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ ప్రమాణ స్వీకారోత్సవ సభకు డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, మున్సిపల్ మాజీ చైర్మన్లు చిక్కాల గణేష్, పెచ్చెట్టి విజయలక్ష్మి, మాజీ కౌన్సిలర్లు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

హనుమంతరావుకు యంగ్ మైండ్ పురస్కారం

అమలాపురం టౌన్: జిల్లా పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ బి.హనుమంతరావుకు యంగ్ మైండ్స్ సంస్థ ఉత్తమ సేవా పురస్కారాన్ని అందించింది. కాకినాడకు చెందిన యంగ్ మైండ్స్ స్వచ్ఛంద సంస్థ వివిధ రంగాల్లో కృషి చేస్తున్న వారికి ఆదివారం పురస్కారాలు ప్రదానం చేసింది. కాకినాడలో నిర్వహించిన కార్యక్రమంలో హనుమంతరావుతోపాటు అయినవిల్లి మండలం చింతనలంక, విలస జెడ్పీ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పి.పల్లయ్య శర్మ, పి.రవిప్రసాద్ ఈ పురస్కారాలు అందుకున్నారు. పురస్కార గ్రహీతలను సోమవారం డీఈవో డాక్టర్ షేక్ సలీమ్ బాషా, సమగ్ర శిక్ష ఏపీసీ జి.మమ్మీ, డీవైఈవో గుబ్బల సూర్యప్రకాశం, సీఎంవో బీవీవీ సుబ్రహ్మణ్యం, ఏపీవో డాక్టర్ ఎంఏకే భీమారావు, ఏఎంవో పి.రాంబాబు అభినందించారు.

మోసం, వెన్నుపోటు చంద్రబాబుకు అలవాటే

- వైఎస్సార్ సీపీ అమలాపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్
- ఉప్పలగుప్తం, అల్లవరంలో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ' సమావేశం



ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు ఇచ్చిన హామీలను స్క్రీన్‌పై ప్రదర్శిస్తున్న కో ఆర్డినేటర్ శ్రీకాంత్



బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ పోస్టర్లను ప్రదర్శిస్తున్న శ్రీకాంత్, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

ఉప్పలగుప్తం: ప్రతి ఎన్నికకు తప్పుడు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలను మోసం చేయడం, నమ్మిన వారిని వెన్నుపోటు పొడవడం సీఎం చంద్రబాబునాయుడికి అలవాటేనని అమలాపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ అన్నారు. మండలంలోని గొల్లవిల్లి భీమేశ్వర ఆడిటోరియంలో మండల పార్టీ అధ్యక్షుడు బద్రిబాబ్జి అధ్యక్షతన కార్యకర్తలతో కలిసి బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకాంత్, నియోజకవర్గ పరిశీలకుడు పేరి శ్రీనువాస్ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించి ఆదర్శవంతమైన పరిపాలన సాగించారన్నారు. చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్ కలిసి ఎక్కువ పథకాలు అమలు చేస్తామని ఎన్నికల్లో ప్రచారం చేసుకుని గద్దెనెక్కిన అనంతరం హామీలను విస్మరించి ప్రజలను మోసం చేశారన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఎన్నికల ముందు చేసిన ప్రసంగాలు, హామీలను ప్రదర్శించి వారు చేసిన మోసాలను ప్రజల్లోకి తీసుకుని వెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. క్యూఆర్ కోడ్‌తో కూడిన రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో బ్రోచర్‌ను అవిష్కరించారు.

కక్షపూరితంగా ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టు

ఎంపీ మిథున్‌రెడ్డిని కూటమి ప్రభుత్వం కక్షపూరితంగా అరెస్టు చేసిందని ఆ సంఘటనను నిరసిస్తూ బ్రోచర్‌ను అవిష్కరించారు. నియోజకవర్గ పరిశీలకుడు శ్రీనువాస్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో కమిటీలను పటిష్టం చేసి బాబు మోసాలను ప్రజల్లోకి తీసుకుని వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు, వైస్ ఎంపీపీ సాదే శ్రీనువాసరావు, సర్పంచులు కడిమి చిన్నవరాజు, పెయ్యల రాజ్‌కుమార్, జొన్నాడ శ్రీదుర్గ, యర్రంశెట్టి రామచంద్రరావు, ఎంపీటీసీలు పెట్టా అప్పారావు, కొంకి ఏడుకొండలు, రాష్ట్ర కార్యదర్శులు దంగేటి రాంబాబు, బొడ్డు నాగేశ్వరరావు(బుజ్జి), పార్టీ సీనీయర్ నాయకుడు కుడుపూడి భరత్‌భూషణ్ ఆయా విభాగాల జిల్లా అధ్యక్షులు జిన్నూరి వెంకటేశ్వరరావు, చీకట్ల కిషోర్, వంగా గిరిజాకుమారి, కార్యదర్శులు బడుగు మేరీ, దంగేటి దొరబాబు, పొగాకు శ్రీను, ఆయా విభాగాల మండల అధ్యక్షులు పోతుమూడి కొండబాబు, ఓగూరి విజయ్‌కుమార్, యనమదల పల్లంరాజు, కోటుం లోవరాజు, బీర బాలరాజు, పోలిశెట్టి వీర్రాజు, మండల ప్రధాన కార్యదర్శి పినిపే జయరాజు, పార్టీ నాయకులు కోరుకొండ మంగాయమ్మ, పెయ్యిల రమణ, లంకే శ్రీను, సలాది సతీష్, కాత్రు కృష్ణ, కుంచే స్వామి, బడుగు గణేష్, మోటూరి సత్యంకావు, మానే శ్రీను, సుంకర బుజ్జి, భోగిశెట్టి నరసింగరావు, వీరవెల్లి చినబాబు, మేడిశెట్టి సూరిబాబు, నల్లా నాయుడు పాల్గొన్నారు.

మోసపూరిత వాగ్దానాలతో అరాచక పాలన

అల్లవరం: లోకేష్ రచించిన రెడ్ బుక్ రాజ్యాంగంతో కూటమి ప్రభుత్వం తప్పుడు సాక్ష్యాలు సృష్టించి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి అరెస్టులు చేస్తున్నారని, మోస పూరితమైన వాగ్దానాలతో ప్రజలను మోసం చేస్తున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్ అన్నారు. అల్లవరంలో బసవా వరహాలు కల్యాణ మండపంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొనుకు బాపూజీ అధ్యక్షతన బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమంపై సోమవారం విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ కోఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ గత ప్రభుత్వం కంటే మెరుగైన పథకాలు ఇస్తామని ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం 13 నెలలు కావస్తున్నా ఏ ఒక్క పథకం అమలు చేయలేదన్నారు. చంద్రబాబు, పవన్ వైఫల్యాలను బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ కార్యక్రమం ద్వారా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు శ్రీకాంత్ పిలుపునిచ్చారు. కార్యకర్తలు, నాయకులు సమష్టి కృషితో వైఎస్సార్ సీపీని బలోపేతం చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలన్నారు.

అక్రమ మద్యం తయారీ వెనుక టీడీపీ పెద్దలు

ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ మాట్లాడుతూ టీడీపీ అంటేనే మోసం. ఎన్నికల హామీలను నెరవేర్చకుండా ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేయడం నిత్యకృత్యంలా కూటమి పాలన సాగుతోందన్నారు. కొమరగిరిపట్నంలో అక్రమ మద్యం తయారీ వెనుక టీడీపీకి చెందిన పెద్దలు ఉన్నారని స్థానికంగా ఉన్న ఎమ్మెల్యే, ఎంపీ బాధ్యత వహించాలని ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ అన్నారు. అనంతరం బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ క్యూఆర్ కోడ్ పోస్టర్‌ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీను, ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీ ముత్యాల రామకృష్ణ, నియోజకవర్గ పరిశీలకులు పేరి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకులు నాతి శ్రీనివాసరావు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి చింతా రామకృష్ణ, సర్పంచ్‌లు రాపాక విజయలక్ష్మి, బత్రే సీతారత్నం, ఎంపీటీసీలు గుబ్బల బాబ్జి, శ్రీశాంతి భవాని, మాకే కృష్ణమూర్తి, పల్లి జేమ్స్, పార్టీ నాయకులు తిక్కా ప్రసాదు, అల్లూరి సురేష్‌రాజు, ఉండ్రు వెంకటేశ్వరరావు, పరమట శ్రీను, కర్రి వెంకట రామారావు, బళ్ల శ్యామ్ తదితరులు లు పాల్గొన్నారు.

రాజ్యాంగం అమలులో పాలకుల నిర్లక్ష్యం

తాళ్లరేవు: ప్రజల ఆకాంక్షలు, ఆశయాలకనుగుణంగా రూపొందించిన భారత రాజ్యాంగం అమలులో పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని సీపీఎం నాయకుడు టేకుమూడి ఈశ్వరరావు అన్నారు. స్థానిక ప్రజా సంఘాల భవనంలో రాజ్యాంగం, సెక్యులరిజం, సోషలిజం అనే అంశాలపై స్టడీ సర్కిల్ సమావేశాన్ని నిర్వహించారు. రాజ్యాంగ పీఠికలో ఉన్న స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, సామాజిక న్యాయం తదితర అంశాలను పొందుపరిచారన్నారు. స్వతంత్ర్య పోరాటంలో ప్రజల ఆకాంక్షలు, ఆశయాలకు అనుగుణంగా ఏర్పాటు చేసిన వాటిని అమలు చేయడంలో పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని చర్చించారు. ఈ కార్యక్రమంలో విశ్వజన కళామండలి రాష్ట్ర అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు, విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రతినిధులు అత్తిలి బాబూరావు, ఎలిపే నాగేశ్వరరావు, ప్రజా సంఘాల నాయకులు వల్లు రాజబాబు, నల్లి ఈశ్వరరావు, పి.బాబా, ఆర్.నాగలక్ష్మి, పి.అనంతలక్ష్మి, అదృష్టదీపుడు పాల్గొన్నారు.



స్థానిక ప్రజాసంఘాల భవనంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఆటస్థలం మెరక పనులకు నాసిరకం మట్టి

కాట్రేనికోన: కందికుప్ప ఆకాశం సన్యాసి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల ఆట స్థలంలో మెరక పనులకు వాడిన మట్టిలో జంతువుల ఎముకలు, ఖాళీ మద్యం, గాజు సీసాలు, సూదులతో కూడిన సిరంజిలు, ప్లాస్టిక్ వ్యర్థాలను కూలీలతో ఏరివేస్తున్నారు. పాఠశాల ఆట స్థలానికి వాడిన మట్టి ఎంత మాత్రం ఫిల్లింగ్ పనులకు పనికి రాదు. ఇప్పటి వరకూ వేసిన మట్టిని పూర్తిగా తొలగించి నాణ్యమైన మట్టిని పాఠశాల ఆవరణ మెరక పనులకు వాడాలని పలువురు కోరుతున్నారు. పాఠశాల ఫిల్లింగ్ పనులు చేపట్టిన సదరు నాయకుడు కూలీలను పెట్టి వ్యర్థాలను ఏరివేత కార్యక్రమం చేపట్టడంపై స్థానికులు మండి పడుతున్నారు. ఈనెల 18న సాక్షిలో మరుభూమి కాదు... మైదానమే శీర్షికన కథనం వెలువడినా సంబంధిత విద్యాశాఖ అధికారులు అలసత్వం వహించడంపై స్థానికులు మండి పడుతున్నారు. విరామ సమయంలో విద్యార్థులు ఆడుకోవడానికి మైదానానికి వెళ్లినపుడు ఏవిధమైన గాయాల పాలైనా పాఠశాల ఉపాధ్యాయులే బాధ్యులవుతారని తల్లిదండ్రులు హెచ్చరిస్తున్నారు. మైదానంలో వ్యర్థాలను చూసి విద్యార్థులు అడుగు పెట్టేందుకు భయపడుతున్నారు. విద్యార్థుల పట్ల విద్యాశాఖ వ్యవహరిస్తున్న తీరుపై తల్లిదండ్రులు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల మైదానం ఫిల్లింగ్ పనులకు వాడిన మట్టిని తొలగించాలని లేకుంటే జిల్లా గ్రీవెన్సుకు ఫిర్యాదు చేస్తామన్నారు.



కందికుప్పలో పాఠశాల మైదానంలో వేసిన మట్టి నుంచి ఏరివేసిన గాజు, ప్లాస్టిక్, ఇనుము వ్యర్థాలు

గ్రంథాలయ సమస్యలు పరిష్కరించాలి

అమలాపురం టౌన్: స్థానిక మున్సిపల్ పిల్లల పార్కు వద్ద గల గ్రంథాలయంలో తిష్ట వేసిన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణికి ఆ గ్రంథాలయ పాఠకులు సోమవారం వినతిపత్రం అందించారు. అంబేడ్కర్ సేవా సమితి అధ్యక్షుడు చీకురుమిల్లి కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రంథాలయ పాఠకులు స్థానిక మున్సిపల్ కార్యాలయానికి వచ్చి వినతిపత్రం అందించి సమస్యలపై చర్చించారు. మూడేళ్లుగా గ్రంథాలయంలో సిబ్బంది లేరని చైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్లారు. శిథిలావస్థకు చేరిన గ్రంథాలయ భవనానికి మరమ్మతులు చేయాలని విజ్ఞప్తి చేశారు. సమస్యలపై మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి సానుకూలంగా స్పందించారు. అంబేడ్కర్ సేవా సమితి ఉపాధ్యక్షుడు సంసాని రత్నకుమార్, గ్రంథాలయ పాఠకులు నూలు సుబ్రహ్మణ్యం, కె.శ్రీనివాస్, ఎ.నారాయణరావు వినతి పత్రం అందించారు.



గ్రంథాలయ సమస్యలపై మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణికి వినతిపత్రం అందిస్తున్న పాఠకులు

చిరస్మరణీయుడు ప్రజాకవి చంద్రరావు

అమలాపురం రూరల్: అంబేడ్కర్ ఆశయాలను తన సాహిత్యం, పద్యాల ద్వారా ప్రజాకవి చోడగిరి చంద్రరావు విస్తృత ప్రచారం చేసి చిరస్మరణీయుడిగా నిలిచారని అమలాపురం త్రిరత్న బుద్ధ విహార్ వ్యవస్థాపక అధ్యక్షుడు, రాజోలు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ గొల్లపల్లి సూర్యారావు అన్నారు. తిరత్న బుద్ధ విహార్‌లో సోమవారం ప్రజాకవి చోడగిరి చంద్రరావు పుస్తకావిష్కరణ సభ బండి సత్యనారాయణ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గొల్లపల్లి, విశిష్ట అతిథిగా డాక్టర్ కోయ కోటేశ్వరరావు పాల్గొన్నారు. చంద్రరావు రాసిన భీమ శతకం, వేమన శతకం విశేష ప్రజాదరణ పొందాయని వారన్నారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ బండి సత్యనారాయణ, పుస్తక ప్రచురణకర్త నేలపూడి బాలరాజు, డీబీ లోక్, ఎంఏకే భీమారావు, నాగాబత్తుల ప్రసాద్‌రావు బీవీవీ సత్యనారాయణ, కోటా రామ్మోహన్‌రావు, ఎంఏకే భీమారావు, పెనుమాల చిట్టిబాబు, రేవు తిరుపతిరావు, పులిదిండి సత్యనారాయణ, నాగాబత్తుల నరసింహమూర్తి, కాశీ వెంకట్రావు, ఐఎన్ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.



ప్రజాకవి చంద్రరావు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గొల్లపల్లి తదితరులు

ఆక్సిజన్ ప్లాంట్‌ను పునరుద్ధరించాలని వినతి

అమలాపురం రూరల్: డైరెక్టర్ సుకుమార్ ఉదారతతో రూ.40 లక్షల వ్యయంతో రాజోలు ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఆక్సిజన్ ప్లాంట్ మూలన పడిందని పంచాయతీ రాజ్ డిప్యూటీ ఈఈ అన్యం రాంబాబు అవేదన వ్యక్తం చేశారు. కోవిడ్ విపత్తు సమయంలో 2021లో ఆక్సిజన్ ప్లాంట్ ప్రారంభించడంతో అనేక మంది కోవిడ్ బాధితుల ప్రాణాలను కాపాడేందుకు ఉపయోగపడిందన్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్లాంట్ నిరుపయోగంగా మారిందని రాంబాబు జేసీ నిషాంతికి సోమవారం వినతి పత్రం అందించారు. ప్లాంట్‌ను వెంటనే పునరుద్ధరించాలని జేసీని సుకుమార్ బావ బ్రహ్మాజీ రాత పూర్వకంగా కోరారు.

ప్రజల దృష్టి మళ్లించేందుకే అక్రమ కేసులు

ముమ్మిడివరం: ఎన్నికల హామీలు నెరవేర్చకుండా ప్రజల దృష్టి మళ్లించేందుకే కూటమి ప్రభుత్వం వైఎస్సార్ సీపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేస్తున్నారని ఆ పార్టీ కోనసీమ జిల్లా అధికార ప్రతినిధి కాశి రామకృష్ణ విమర్శించారు.సోమవారం ఆయన ముమ్మిడివరంలో మాట్లాడుతూ అత్యంత ప్రజాదరణ కలిగి మూడు సార్లు ఎంపీగా గెలుపొందిన మిథున్‌రెడ్డిని అరెస్టు చేయడం దారుణమన్నారు. ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టును ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. కావాలనే రిమాండ్ రిపోర్టులో తనకు నచ్చనివారిని, వైఎస్సార్ సీపీకి చెందిన వారిని నిజాయతీ గల అధికారులను కేసుల్లో ఇరికించేలా కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు.అక్రమ అరెస్టులు, తప్పుడు కేసులు విడనాడకపోతే కూటమి నాయకులు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని రామకృష్ణ హెచ్చరించారు.



కాశి రామకృష్ణ

వైఎస్సార్ సీపీ నాయకులపై కక్ష సాధింపు తగదు

ఉప్పలగుప్తం: కూటమి ప్రభుత్వం వైఎస్సార్ సీపీ నాయకులపై కక్ష సాధింపు చర్యలు తగదని పార్టీ బూత్ కమిటీల విభాగం జిల్లా అధ్యక్షుడు చీకట్ల కిషోర్ అన్నారు. వైఎస్సార్ సీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టును ఖండిస్తూ సోమవారం ఓ ప్రకటనను విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా సమస్యలను గాలికొదిలి వైఎస్సార్ సీపీ నాయకులను ఇబ్బందులకు గురి చేయడమే ధ్యేయంగా వ్యవహరిస్తోందన్నారు. ప్రజలు రాబోయే రోజుల్లో కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తారని ఆయన హెచ్చరించారు.

బిల్డర్లు, రియల్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడిగా బాబీ

అమలాపురం టౌన్: ది అమలాపురం బిల్డర్స్ అండ్ రియల్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన మండెల బాబీ రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో సోమవారం ఏర్పాటు చేసిన అసోసియేషన్ ప్రతినిధుల సమావేశంలో అధ్యక్షుడిగా బాబీతో పాటు పూర్తి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడిగా మాజీ మున్సిపల్ చైర్మన్ చిక్కాల గణేష్, పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ ఎన్నికయ్యారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా సుంకర స్వామి నాయుడు, ప్రధాన కార్యదర్శిగా కొత్తూరి శ్రీను, కార్యదర్శిగా ముద్రగడ తాసు, సంయుక్త కార్యదర్శులుగా మార్శేళ్ల చినబాబు, కొండారెడ్డి, కోశాధికారిగా రేకపల్లి సోము ఎన్నికయ్యాయ. వీరితోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. త్వరలోనే అసోసియేషన్ కోనసీమ క్రిడియా చాప్టర్ ఏర్పాటు చేయాలని సమావేశం తీర్మానించింది. బిల్డర్లు, రియల్టర్ల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని అధ్యక్షుడు బాబీ స్పష్టం చేశారు.



ది అమలాపురం బిల్డర్స్ అండ్ రియల్టర్ల అసోసియేషన్‌కు ఎన్నికైన నూతన కార్యవర్గ ప్రతినిధులు

భారీ వర్షాలతో పల్లపు ప్రాంతాలు జలమయం

తాళ్లరేవు: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. మండలంలోని పలు రహదారులపై నీరు నిల్వ ఉండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా తాళ్లరేవు, సీతారామపురం, నీలపల్లి, ఇంజరం తదితర ప్రాంతాల్లో రహదారులపై నీరు చేరడంతో చెరువులను తలపిస్తున్నాయి. ముఖ్యంగా భారీ వర్షాలకు సుంకరపాలెం రహదారి ఛిద్రమైంది. యానాం–ద్రాక్షారామ ఆర్‌అండ్‌బీ రహదారిలో సుంకరపాలెం బైపాస్ జంక్షన్ నుంచి శివాలయం వరకు రహదారి వర్షాలకు అధ్వాన్నంగా తయారైంది. ఈ రహదారిని నాలుగు నెలల క్రితం సుమారు రూ.5 లక్షల వ్యయంతో మరమ్మతులు చేసారు. రహదారి సమస్య యథాస్థితికి రావడంతో స్థానిక ప్రజలు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి రహదారిని శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి చేయాలని శ్రీ లక్ష్మీవరసిద్ధి వినాయక బైపాస్ వర్తక సంఘం ప్రతినిధులు, స్థానికులు కోరుతున్నారు.



సుంకరపాలెం రహదారిపై వర్షం నీరు

నరసింహ చంద్రకుమార్‌కు గ్రేట్ క్రియేటివ్ ఆర్టిస్ట్ అవార్డు

అమలాపురం రూరల్: ఇటీవల క్రియేటివ్ హార్ట్స్ అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ సంస్థ సిందూర్ – సెల్యూట్ ఇండియన్ సోల్జర్స్ అనే అంశంపై కాట్రేనికోనలో జాతీయస్థాయిలో నిర్వహించిన చిత్రకళా పోటీల్లో అమలాపురం మండలం పాలగుమ్మి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిత్రలేఖన ఉపాధ్యాయుడు పోలిశెట్టి నరసింహ చంద్రకుమార్‌కు గ్రేట్ క్రియేటివ్ ఆర్టిస్ట్ అవార్డు లభించింది. చంద్రకుమార్ వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ (వైమానిక దళం), కల్నల్ సోఫియా ఖురేషి (ఆర్మీ) చిత్రాన్ని వాటర్ కలర్స్ ఉపయోగించి వేసిన చిత్రానికి ఈ అవార్డు లభించింది. 15 రాష్ట్రాలకు చెందిన 250 మంది అద్భుత చిత్రకారులు ఇందులో పాల్గొన్నారని పోటీల నిర్వాహకుడు ఆకొండి అంజి తెలిపారు. అవార్డుకు ఎంపికైన చంద్రకుమార్‌ను పలువురు అభినందించారు.

స్విమ్మింగ్ పోటీల్లో శాయ్ క్రీడాకారుల ప్రతిభ

యానాం: విశాఖపట్టణం ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఈనెల 19,20 తేదీల్లో నిర్వహించిన 10వ ఇంటర్ డిస్ట్రిక్ట్ సబ్‌జూనియర్, జూనియర్ చాంపియన్‌షిప్ –2025 స్విమ్మింగ్ పోటీల్లో యానాం స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (శాయ్) క్రీడాకారులు విశేష ప్రతిభ చాటారని సోమవారం అకాడమీ ఇన్‌ఛార్జి ఉదయ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వి.వెంకటనాగసాయి 50 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్‌లో ద్వితీయస్థానం, విజ్ఞాన్ అఖిలేష్ 200 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్‌లో ద్వితీయ, 100 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్‌లో తృతీయస్థానం, టి ప్రేమ్‌కుమార్ 50 మీటర్ల బ్యాక్ స్ట్రోక్‌లో తృతీయస్థానం సాధించి 2 రజత, 2 కాంస్య పతకాలు సాధించారన్నారు. క్రీడాకారులను పలువురు అభినందించారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

అమలాపురం రూరల్: జీవితాన్ని చిన్నాభిన్నం చేసే డ్రగ్స్‌కు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలంటూ అమలాపురం తాలూకా ఎస్సై శేఖర్‌బాబు సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అమలాపురం రూరల్ మండలం బండారులంక ఉన్నత పాఠశాలలో సోమవారం డ్రగ్స్‌కు వ్యతిరేకంగా సదస్సు నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం బాల ఉపాధ్యాయులు, పోలీసులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం

అమలాపురం రూరల్ : రోళ్లపాలెం స్వర్ణ దుర్గ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడిగా మట్ట మహాలక్ష్మి ప్రభాకర్‌రావు ప్రమాణ స్వీకారం చేశారు.ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు. సాకర్రు సొసైటీ వద్ద పీఏసీఎస్ నూతన త్రిసభ్య కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. చైర్మన్‌గా నల్లా వెంకటేశ్వరరావు, డైరెక్టర్లు బాధ్యతలు స్వీకరించారు.

విద్యుత్ స్తంభం ఏర్పాటు



వానపల్లిపాలెంలో నూతన విద్యుత్ స్తంభం ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

సాక్షి ఇంపాక్ట్

ఉప్పలగుప్తం: వానపల్లిపాలెం గ్రామ పంచాయతీ పరిధి బీవీ రమణయ్య నగర్‌లో విరిగిపోయిన విద్యుత్ స్తంభం స్థానంలో విద్యుత్ శాఖాధికారులు సోమవారం నూతన స్తంభాన్ని ఏర్పాటు చేశారు. ఆ ప్రాంతంలో ఇనుప విద్యుత్ స్తంభం విరిగిపడి 15 రోజులు గడుస్తున్నా ఆ స్థానంలో కర్రను పాతి తీగలను దానికి వేలాడదీయడంతో స్థానికులు ఆందోళనకు గురై ఆదివారం నిరసన తెలిపారు. దీనిపై విద్యుత్ ప్రమాదాల నుంచి రక్షించండి శీర్షికతో సోమవారం సాక్షిలో వెలువడిన కథనానికి అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

అంగన్‌వాడీల ఆందోళన



ముమ్మిడివరం ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు

ముమ్మిడివరం: తమ డిమాండ్ల సాధన కోసం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు, పిల్లల తల్లులతో కలిసి సోమవారం ఆందోళన చేశారు. కనీస వేతనం చెల్లించాలని, ఎఫ్ఆర్ఎస్, ఈకేవైసీలను రద్దు చేయాలని, మట్టి ఖర్చుల కోసం విడుదల చేసిన జీఓను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సీడీపీఓ విమలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అనధికార నిర్మాణాల క్రమబద్ధీరణ

యానాం: ప్రభుత్వ భవనాలకు ఒన్‌టైమ్ ఫీజు చెల్లింపుల నుంచి మినహాయింపు ఇచ్చినప్పటికీ నివాస భవనాల యజమానులు చదరపు మీటరుకు రూ.500 చెల్లించాలని, మిగిలిన మిశ్రమ వినియోగ భవనాలు, ప్రత్యేక భవనాలకు చదరపు మీటరుకు రూ.750 క్రమబద్ధీకరణ చార్జీలు చెల్లించాలని ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. బహుళ అంతస్తుల భవనాలకు రుసుము చదరపు మీటరుకు రూ.1000 నిర్ణయించినట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించి నిర్మించిన భవనాలు, నిర్మాణాలకు రుసుము చెల్లించిన తర్వాత ఒకేసారి క్రమబద్ధీకరించే పథకాన్ని ప్రభుత్వం నోటిఫై చేసింది. నిబంధనలు ఉల్లంఘించిన నివాసభవనాలకు రూ.5వేలు చెల్లించాలని, ఇతర నిర్మాణాలకు రూ.10,000 తిరిగి చెల్లించడం ద్వారా పట్టణ, గ్రామీణ ప్రణాళికా విభాగంలో నమోదు చేసుకోవచ్చునని అధికారులు అన్నారు.